# 'ఇది నా న్యాయం'

ఏపుగా పెరిగిన మొక్కజొన్న చేలోంచి, బయటికి వచ్చేసరికి దూరంగా గట్టుమీద నీరసంగా నడుస్తూ వస్తున్న సూరి కనబడ్డాడు కోటయ్యకు.

'అరే! ఏంటీ ఈడు వత్తన్నాడు! మాలచ్చి ఏడకుబోయిందో!' అనుకుంటూ సూరికి ఎదురు నడిచేడు కోటయ్య.

చేతిలో టిఫెన్ కేరేజ్ కోటయ్యకు అందించి, ఆ గట్టుమీద కూర్చుండి పోయాడు సూరి ఆయాసంతో.

"ఏందిరా! నువ్వొచ్చినావు! మీ యమ్మ ఏడకుబోయింది! ఈ మద్దినేల ఎండకు బడి రాకపోతే ఏమవుతాదీ....ఓర్నాయన....అసలే....ఒంటూపిరి గాడివి ....ఇప్పుడే కూటికి ఇంత తొందర వచ్చేనా ఏందీ!...."

"టిఫినీ కుమ్మరోళ్ళ బాలయ్య తీసుకుపోతానన్నాడయ్యా....మరే....పెద్దరుగుల బాలరాజుగారు లేరూ, పొద్దుటేల మనింటికాడికొచ్చేడయ్యా.... 'మీ నాయన ఆ కుంట దగ్గర చేను అమ్మనన్నాడంట ఏంట్రా....' అంటూ కేకలేసినాడయ్యా "పుగాకు ఏసినం, అమ్మేందుకు గాదు' అంటే సాలా సేపు తిట్టిండు. నీకు సెప్పాలనీ...."

సూరి ఆగిపోయాడు ఆయాసంతో.

కొడుకు ఆయాసపడుతూంటే కోటయ్యకు నిస్సహాయత్వంతో ముందుగా కోపం వచ్చింది.

"ఏందంట ఈన దాష్టీకం....అమ్మనో అంటే ఎంటబడతాడు. పిలగాడికి ఆరోగ్గెం సరి లేక, వైద్దిగానికి పైసల కోసం ఇంత కష్టం చేత్తుంటే మాటికోపాలి అమ్మో అంటడు....ఒరే సూరే నువు ఈపాలి ఒత్తే సెప్పు....నే మాట్టాడతా" అన్నాడు బక్క కోపంతో. నిజానికి కోటయ్య చేయగలిగేది ఏమీలేదు. సూరికి గుండె జబ్బు. వాడికి వైద్యం చేయించడం శక్తికి మించిన పని కోటయ్యకు. వుండేందుకు వున్న గుడిసె దగ్గర నుంచి అమ్ముకున్నా. కాగా పోగా చెరువు అనుకుని వున్న

అరెకరం పొలం మటుకు మిగిలింది. బాలరాజుకి వున్న యాభై ఎకరాల ఏక ఖండం లోనూ ఆ అరముక్క కంట్లో నలుసు లాగా మిగిలిపోయి వుంది. అదీ కలిస్తే బావుండునని అతని యోచన. ఆ కాస్త మిగుల్చుకోవాలని ఇతని ఆలోచన. కుర్రాడి కయ్యే ఆపరేషన్ ఖర్చుకవి ప్రాణం ధారపోసి, కూలిచేసి, లక్ష్మి, కోటయ్య సంపా దించిన డబ్బంతా ఆ అరెకరంలోనే పెట్టుబడి పెట్టి వుంది. పుగాకు ఏపుగా పెరిగి వాళ్ళ ఆశలకు ఊపిరి పోస్తోంది. కోటయ్య జొన్నతోటకు కాపలాకు పోయినా, లక్ష్మి కూలికిపోయినా, వాళ్ళిద్దరి అరో ప్రాణం ఆ పొగాకు చేలో వదిలేసే.

లక్ష్మి చీకటి పడే వేళకు పొలం నుంచి వస్తుంటే బాలరాజు కేకలు వేశాడు.

"ఏందే....సీలుగు....తిప్పుకొడితే మంచవంత చేను....దాన్ని వదలనని అంత పట్టుదల ఏంటంట. ఏదో చేలో చేను కలుస్తుందవి కానీ...."

అతను చెప్పే తిట్లు, కబుర్లు అన్నీ విన్నాక లక్ష్మి చాలా వినయంగాఅతనికి నచ్చ చెప్పబోయింది.

అది ఈ సరికే పెద్దరెడ్డికి తనఖాపెట్టినాము, పిలగాడికి రోగానికే ఏడేడ డబ్బులు నూర్చుకుపోతూ వున్నాయి. ఆప్రేషన్ అయితే కుర్రాడు కాస్త లేచి తిరుగు తాడని ఆసుందయ్యా అందుకే వళ్ళిరుసుకోని పన్లకు పోవటం....నీకు అమ్మితే ఆయన ఎట్టూరుకొంటడు...."

'పెద్ద రెడ్డిని కాస్త ఇరుకున పెట్టాలని కోరిగ్గానీ లేకపోతే ఆ ముక్క ఎవ డికి కావాలీ....అనుకొంటూ "ఓర్నీ దుంప తెంచిరి....నాకు తెలియకనే అడిగేసినా నంట వా ఏందీ! ఆ తాకట్టు పైకం అది మొహాన కొట్టి ఆ పొలం సంగతి నాకు వదలండి....!

"ముందే అమ్మమవిందయ్యా....ఇంకేదో ప్రేణం కొట్టకలాడి....ఎప్పటికైన ఇడిపించుకొంటాం అనుకుంటూ అప్పుజేస్తిని....ఇంకోరకంగా ఆయన ఒప్పుకుం టాడా....మద్దెన పిలగాడి అప్రేషను....ఆ పొలంమీద ఎంత పెట్టుబడి పెడితిని. అయి సేతికి రావాల, కుర్రోడు దక్కాల...."

లక్ష్మి ఏడ్చేసింది సూరి గుర్తువచ్చి. లేచి తిరిగేందుకు, కడుపునిండా తినేం దుకు కూడా ఓపికలేదు వాడికి.

"ఇదిగో నువ్వే లిటిగెంటు లాగా మాట్లాడేస్తే సరిపోద్దా. సరే....పో....నీ.... మాత్రం నాకు సేతకాదే...." బాలరాజు రంకె వేశాడు.

లక్ష్మి గుండె దడదడ మంది భయంతో.

"ఇద్దరు కామందుల మద్దెన మేం నలిగిపోతున్నాం. ఆరూ, మీరూ....అంతా ఓటి కాదా బాబూ. మాకు ఆరు సుట్టాలు, మీరు పైవోరూనా...." అంది ఏడుపు గొంతుతో.

"ఆ సంగతి మాకు తెలుసులే వో....అది ఎట్ట సేతిలోకి లాక్కోవాలో నాకు తెలియదనుకోకు" బాలరాజు లోపలకి వెళ్ళిపోయాడు.

లక్ష్మి ఇంటికి వచ్చేసరికి సూరి మూలుగుతున్నాడు. అంతదూరం నడిచేసరికి వాడికి ఆయాసం, నీరసం వచ్చింది. వాడు ఊపిరి అందక తన్నుకొంటుంటే ఏడుస్తూ వాడి దగ్గరే కూర్చుంది లక్ష్మి.

"డబ్బునోళ్ళకి రోగాలు రాక, తిండిలేనోలకి రోగాలేందీ! ఏం బతికించు కొంటాం....ఈ పంట వచ్చేదాక ఈడు బతికుంటాడా...." తలచుకొంటూ భోరు మని ఏడ్చింది లక్ష్మి.

*　　*　　*　　*　　*

ఆ ఉదయం అందరూ పన్లోకి వెళ్ళాక గుడిసె బయట నీరెండలో పడుకొని వున్నాడు సూరి. బాలయ్య పరిగెత్తుకొంటూ వచ్చాడు.

"ఓరి సూరే....మీ అమ్మేదిరా...."

"బాలరాజు ఆళ్ళ సేనికి నీళ్ళు పెట్టుకుంటా వున్నాడు. మీ మడి సెక్కలోంచి కాలువ దియ్యకుండా ఏకంగా గట్టుగొట్టిండు. పాతిక ఎకరాల సేను తడుస్తా నీళ్ళు పార్తా వుండాయి ఆయన సేలోకి. మొక్కలు ఆవజాన కూలిపోతూవుండాయి నీళ్ళు వస్తావుంటే పోయి సెప్పరోయ్...." అన్నాడు.

"నేనా....నువ్వే సెప్పన్నా. మా యమ్మ తూర్పుమాగాణికి బోయింది, మా నాయన ఆ దొంకనే మొక్కజొన్న సేలో వుంటాడు."

"నాకేడ కుదురుద్దిరా....నేను ఇంజన్ చెడిపోతే, ఊర్లోకి పోతున్నా. నాగ్గుద రదు...." బాలయ్య పరుగులు తీశాడు. సూరికి కాళ్ళు చేతులు ఆడలేదు. తల్లి దగ్గరికి పోవాలన్నా, తండ్రి దగ్గరకు పోవాలన్నా వాడికి ఓపికలేదు.

'కాస్త కాలవకి అడ్డం వేసి ఆపైన తండ్రికి చెబితే....లేని ఓపిక తెచ్చుకొని చెరువుగట్టున అడ్డంపడి నడవడం మొదలుపెట్టాడు వాడు. పొలం దగ్గరకి వచ్చేసరికి వాడి గుండెలు అవిసిపోయాయి. కాలువనీరు ఉధృతంగా పారుతోంది. మడిచెక్క లోంచి గట్టుకోసేస్తోంది నెమ్మదిగా. సగానికి సగం చెట్లు నీటివేగానికి పడిపోయాయి. మామూలుగా నీళ్ళు అవసరం అయితే ఓ పక్కనించి కాలవ తీసి పెడతారు. అలా కాకుండా గండి కొట్టి వదిలేడు. తల్లి తండ్రి పెట్టుకున్న ఆశలు ధ్వంసం చేస్తూ చేమ నీటిలో మునిగిపోతోంది. గండి పూసేందుకు ఓ అడుగు కూడా వేయక ముందే వాడికి తీవ్రమైన నెప్పి వచ్చింది. ఓ వూపున వాడు అడ్డంగా ఆ కాలువలో పడిపోయాడు. వాడు లేచేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా నీరు ముంచేసింది వాడిని. కోటయ్యకి కబురు తెలిసి పరుగెత్తి వచ్చేసరికి మిగిలింది ధ్వంసం అయి

పోయిన పొలం.... తగలెయ్యటానికి మాత్రం పనికివచ్చే కొడుకు శవం....వెనకే ఏడుస్తూ పరిగెత్తి వచ్చే లక్ష్మి ఓ క్షణం కేకలు ఆపి నిర్ఘాంతపోయి చూచింది. ఆమె తేరుకుని చూచేసరికి కోటయ్య లేడు.

కోటయ్యకు బాలరాజు ఇంటి గుమ్మం దగ్గరే ఎదురయ్యాడు.

"పొలం గావల్నా ఏందీ...." అన్నాడు కోటయ్య.

"ఏందిరోయ్ జోరు....బుర్ర తిన్నగా వచ్చింది లాగుందే...."

"సేలో నీళ్ళెందుకు రానిచ్చినవో...." సూటిగా అడిగేడు కోటయ్య.

"ఎందుకు రానిచ్చేదేందిరా....చేనికి నీళ్ళు పెట్టుకోవడం ఎందుకు?"అన్నాడు బాలరాజు.

"నా సేలోంచి ఎందుకు అనీ...."

"ఏడ వరస గుదిరితే ఆడ పెడతారు. అదీ నీ ఇష్టం ఏందంటా?"

"అదే నేనూ సెప్తన్న. ఆ వరస ఈడ కుదిరింది మరి నాకు...."

కోటయ్య చేతిలో పార బలంగా బాలరాజు తల బద్దలు చేసింది.

"ఎవరి కోసవో....ఎవడి మీదనో పగ తీర్చుకొనేందుకు నీకీ బక్కోడే దొరి కేడంటరా...."

చేతిలో పార విసిరి పారేసి వెనక్కి తిరిగేడు కోటయ్య....అవును మరి అది కోటయ్య న్యాయం.

"ఎంత పని చేస్తివి! ఇప్పుడేం దారి దేవుడోయ్...." లక్ష్మి ఏడుపు వింటూనే ఒక్క కేక పెట్టేడు కోటయ్య.

"మద్దిన దేవుడెందుకు....కుర్రోడు పోయాడు, సేను ఎటు తిరిగే పోద్ది....ఈ భాగ్యేనికి భయం ఎ దుకు! ఆయన సేసేది ఆయన సేయబట్టే, నాకు తోసింది నేను చేసి పారేశా...."

లక్ష్మి పిచ్చి చూపులు చూస్తోంది అతని వేపు. బాలరాజు భార్య....తల్లి.... శోకాలు తీస్తూ పరుగెత్తి వస్తున్నారు. చుట్టూ జనం క్షణంలో వచ్చేశారు. అందరి మధ్య నిలబడి వున్నాడు కోటయ్య.

"వీడికేదో పిచ్చి పట్టింది. పట్టుకోండి ముందు...." కోటయ్య మీద పడి పట్టుకున్నారు కొందరు. దెబ్బమీద దెబ్బ తగులుతోంది అతనికి. బక్క వూపిరి. మట్టిలో పడిపోతున్నాడు. పడిపోయినప్పుడల్లా బాలరాజు శవం తల పగిలి కనబడు తోంది అతనికి. అతడి మనస్సులో చెరువు నీళ్ళలో గండికి అడ్డంగా కొట్టుకొచ్చి నిలుక్కుపోయిన కొడుకు కనబడుతున్నాడు. కొడుకును తలచుకుని, బాలరాజును చూస్తూ దారుణమైన దెబ్బలు తింటున్న కోటయ్య నవ్వుతూనే వున్నాడు.

(17-7-87. ఆంధ్రజ్యోతిసచిత్ర వారపత్రిక) *